# బాలమిత్ర

- వాసంతి మాఘుపు.

మన పెద్దవాళ్ళు మాటల్లో 'ఇది వీడికి వెన్నతో పెట్టిన విద్య', 'ఉగ్గుపాలతో నేర్చుకున్నాడు' లాంటివి ఉపయోగించడం వినే ఉంటారు. దాని అర్థం ఏమిటంటే, పసి వయస్సులో పిల్లలకి విన్నది విన్నట్టుగా గుర్తుండిపోతుంది. అందుకే పూర్వం రోజులలో పాలు పడుతున్నప్పుడు, స్నానం చేయిస్తున్నప్పుడు, నిద్ర పుచ్చుతున్నప్పుడూ కూడా పాటల రూపములో నీతులు, విజ్ఞానదాయకమైన విషయములు నేర్పేవారు. ఇప్పుడు 'మా వాడు చిరంజీవి పాట పెడితేగాని ముద్దనోట్లోకి పోదండి' అని, 'కార్టూను నెటవర్క్ లేకపోతే మా అబ్బాయి పాలు కూడా తాగడు' అని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ మార్పు హర్షించదగినదో కాదో తెల్సుకోవలసినది పాఠకులు మాత్రమే! దశావతారములను తెలియజేప్పే ఈ క్రింది పాటలో రచయిత చేసిన ప్రయత్నం ఎంత మెచ్చుకోదగ్గదో!

### *అవతారం*

*మా పాప మామల్లు మత్స్యావతారం*
*కూర్చున్న తాతల్లు కూర్మావతారం*
*వరుసైన బావల్లు వరహావతారం*
*నట్టింట నాయత్త నరసింహావతారం*
*వాసిగల బొట్టెల్లు వామనావతారం*
*పరమగురుదేవ పరశురామావతారం*
*రక్షించురామయ్య రామావతారం*
*బంటైన బంధువులు బలభద్రావతారం*
*బుద్ధితో మా చిట్టి బుద్ధావతారం*
*కలివిడితో మా యన్న కలికావతారం*
*వర్ధిల్లు పసిపాప వర్ధిల్లు మమ్మ*
*చిట్టి నా కన్నయ్య శ్రీ కృష్ణావతారం!*

### పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

**1.** ఇది 2 అక్షరముల ఊరి పేరు.
**2.** ఇక్కడ చాలా ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం ఉంది.
**3.** ఇది ఒక పిండి వంటకం కూడా.

**ఏమిటా పదం?**

### సమాధానం చెప్పగలరా? ప్రయత్నించండి!

1. పళ్ళు లేకున్నా కరిచేది ఏమిటి?
2. చెవులున్నా వినలేనిది?
3. నాలుక ఉన్నా రుచి చూడలేనిది?
4. గాలితో నిలిచే బుంగ.
   రంధ్రాలెన్నున్నా మనగలుగుతుంది.
   అంతా గాలి వాటం.
   కవాటముల మయం
   గాలి ఎపుడు కరువౌతుందో,
   ఎపుడు గల్లంతో ఎవరికి ఎరుక?
   ఏమిటిది?

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'సమాధానం చెప్పగలరా?'** సమాధానములు.

1. దువ్వెన.
2. అగ్గిపుల్ల, గుండు సూది.
3. గడియారం.
4. చీపురుకట్ట.
5. బుంగ (బెలూను).

*(ఈ కథను **రాధామాధవ్ సొసైటీ సంస్థ** ప్రచురించే **'భక్తి'** పుస్తకమునుండి గ్రహించబడినది. వివరములకు www.jkp.org వీక్షించగలరు.)*

## గురుభక్తి

ఒకానొక సమయములో శ్రీ సమర్థ మహరాజ్ అనే స్వామీజీ తన శిష్యులతో ఒకచోట సమావేశమయ్యారు. శిష్యులందరూ గురువుని సేవించడానికి, అతనిచే ఉత్తమ శిష్యునిగా గుర్తించబడాలనే కాంక్ష ప్రస్ఫుటముగా కనబడుతున్నది. గురువుగారు దీనిని గమనించకపోలేదు. ఓరచూపుతో సృష్టిని శాసించగల సత్తా ఉన్న గురువు, సామాన్యమైన వ్యక్తిగా వ్యవహరించడం వారి గొప్పదనమే! అయితే అతని శిష్యులను పరిక్షించి ఉత్తమ శిష్యుని ఎన్నుకొనడమేగాక, మిగిలిన వారు వారి తప్పు వారే తెలిసికొనేటట్లు చేసే ఉద్దేశ్యముతో శిష్యులను చెంతకు పిలిచారు.

గురువుగారు బాధతో శోకించడం మొదలుపెట్టారు. శిష్యులు నిశ్చేష్టులై నిలబడిపోయారు. కొన్ని క్షణముల తరువాత తేరుకుని గురువుగారు శోకించడానికి కారణము అడిగారు. గురువుగారు బాధను ఉగ్గబట్టుకుని, "అబ్బాయిలూ! నాకు కాలిపైనొక పుండు ఏర్పడి, చాలా బాధించుచున్నది." అని తెలియజేయగా, శిష్యులు అతనిని వైద్యునివద్దకు తీసుకుని వెళ్ళుటకు సంసిద్ధులుకాగా గురువుగారు "అబ్బాయిలూ! ఇది మామూలు కురుపు కాదు. ఇది మామూలు మందులకు తగ్గేది కాదు." అనగా శిష్యులలో చాలా మంది ఏక కంఠముతో "ఖచ్చితముగా దీనికి తరుణోపాయము ఉండి ఉండాలికదా! అది ఏమిటో సెలవివ్వండి." అని ప్రశ్నించగా, గురువుగారు "పిల్లలూ! దీనికి ఒకే ఒక పరిష్కారమున్నది. కాని, అది అంత సులభముకాదు." అని తెలియజేసెను. వెంటనే శిష్యులు "అది ఎంత కష్టమైనదైనప్పటికీ మేము విడిచిపెట్టము. చెప్పుమని" ప్రాధేయపడగా, ఈ సమాధానమునకై ఎదురుచూస్తున్న గురువు "ఎవరైనా ఆ పుండునుండి రసిని నోటితో పీల్చివేసిన ఉపశమనము కలుగునని, అది జరిగిన మరుక్షణము ఆ వ్యక్తి మరణించునని" తెలియజేసెను.

శిష్యులందరూ ఒకరి ముఖమునొకరు చూసుకుని తలదించుకున్నారే తప్ప ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడు వారిలో ఒక శిష్యుడు కళ్యాణ్ ముందుకువచ్చి గురువుకు నమస్కరించి, గురువు బాధను నివారించుటకై తను సిద్ధమని చెప్పగా, గురువు దానికి కట్టబడిన గుడ్డను తొలగించవద్దని, పుండుయొక్క ఒక కొనను చూపించి అచటనుండి పీల్చుమని సూచించెను. గురువు పాదములకు కళ్యాణ్ మరొక్కసారి నమస్కరించి గురువు ఆజ్ఞను శిరసావహించెను. ఆశ్చర్యం! అది తియ్యగా, మధురముగా ఉన్నది. కొద్ది సేపటి తరువాత గురువుగారు నవ్వి, దానికి కట్టిన గుడ్డను తొలగించగా, అక్కడ సగము పీల్చబడిన మామిడి పండు దర్శనమిచ్చింది. దీనిని చూసి మిగిలిన శిష్యులు సిగ్గుతో తలదించుకొనెను. ఇది తమ అవివేకమును తెలియజెప్పుటకు గురువు పెట్టిన పరీక్షయని తెలిసికొనిరి.

**నీతి** : గురుభక్తి పరిపూర్ణమై ఉండాలి. జన్మరాహిత్యమునకు విశ్వాసపూరితమైన గురుభక్తిని మించిన సాధనము లేదు.